


EVENING EDITION

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

4PM

www.suryaa.com

శనివారం

20-12-2025

పేజీలు: 02


## ఈ భామ రూటే
# సపరేటు

కుర్ర హీరోలతో పోటీపడుతూ సీనియర్ హీరోలు వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఏడాదికి ఒకటి, రెండు సినిమాలు చేస్తూ ప్రేక్షకులను విశేషంగా మెప్పిస్తున్నారు సీనియర్ హీరోలు.. చిరంజీవి, వెంకటేష్, నాగార్జున, బాలకృష్ణలాంటి సీనియర్స్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీ బిజీగా మారిపోయారు. అయితే సీనియర్ హీరోల సరసన నటించడానికి హీరోయిన్స్ దొరకడం ఒకింత కష్టమే.. యంగ్ బ్యూటీ సీనియర్ హీరోల పక్కన నటించడానికి ఆలోచిస్తారు.. కానీ ఈ ముద్దుగుమ్మ మాత్రం వరుసగా సీనియర్ హీరోల సినిమాల్లో ఛాన్స్ లు అందుకుంటుంది. ఇప్పటికే మెగాస్టార్, నాగార్జునలాంటి హీరోలతో చేసింది ఇప్పుడు మరో సీనియర్ హీరో సినిమా లో ఛాన్స్ అందుకుంది. ఆ యంగ్ బ్యూటీ ఎవరో తెలుసా.?కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన అమిగోస్ అనే సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది ముద్దుగుమ్మ ఆషిక రంగనాథ్. మంచి అంచనాల నడుమ విడుదలైన అమిగోస్ సినిమా.



## మంత్రివర్గంలోకి
# రాజగోపాల్‌రెడ్డి!

ముఖ్యనేత సన్నిహితవర్గం వేసిన ప్లాన్ రివర్స్ అయిందా? సీఎంను పదేపదే విమర్శిస్తున్న ఎమ్మెల్యేపై చేసిన ఫిర్యాదు ఆయనకు వరంగా మారిందా? రెండేండ్లలో పొలిటికల్ లాబీయింగ్ ద్వారా జరగనిది ఆ ఒక్క ఫిర్యాదు ద్వారా జరిగిపోయిందా? రాజగోపాల్ మీద క్రమశిక్షణచర్యకు సిఫారసు చేసిన ఫైల్ మీదనే 'మంత్రి పదవి ఇవ్వండి' అంటూ ఉల్టా ఆదేశాలు వచ్చాయా? అంటే ఢిల్లీ కాంగ్రెస్ నేతల నుంచి 'అవును' అనే సమాధానమే వస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డికి పంటికింద రాయిలా మారిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశించినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. 'ఆయనకు మనం మంత్రి పదవి హామీ ఇచ్చాం. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలప్పుడు పార్టీ గెలుపునకు సహకరించారు' అని రాహుల్ గుర్తుచేసినట్టు సమాచారం. సామాజిక సమీకరణాలను సమీక్షించి, వీలైనంత త్వరలో రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు రాహుల్ సూచించినట్టు తెలిసింది.రెండో పర్యాయం జరిగిన మంత్రివర్గ విస్తరణలో తనకు బెర్తు ఖాయమని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భావించారు. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి సంకేతాలు అందటంతో ఆయన సన్నిహితులు ఫ్లెక్సీలు, దండలు, బ్యాండ్‌బాజాలు సిద్ధం చేసుకున్నారు. కానీ అదే సమయంలో ఆ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి అడ్డు తగులుతూ.. రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖ రాశారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకునే కుట్రలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ఈ లేఖ రాయించారని రాజగోపాల్‌రెడ్డి అనేక సందర్భాల్లో తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇక అప్పటినుంచి ఆయన నేరుగా సీఎం



రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పదునైన విమర్శలు చేయడం ప్రారంభించారు.రాహుల్‌గాంధీని కేసీ వేణుగోపాల్ కలిసినప్పుడే అసలు కథ మొదలైనట్టు ఢిల్లీ కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. మంత్రి పదవి ఇవ్వలేదనే ఒత్తిడిలోనే రాజగోపాల్‌రెడ్డి అలా మాట్లాడి ఉండవచ్చని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకునేముందే మంత్రి పదవి హామీ ఇచ్చామని రాహుల్‌గాంధీ గుర్తుచేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆయనకు ఇచ్చిన హామీని గౌరవించాల్సిందేనని, సాధ్యమైనంత త్వరలో మంత్రివర్గంలోకి తీసుకోవాలని సూచించినట్టు తెలిసింది. ఇప్పటికే వారి కుటుంబం నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రివర్గంలో ఉన్నారని, ఉమ్మడి నల్లగొండలో ఇద్దరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతలే క్యాబినెట్‌లో ఉన్నారని కేసీ వివరించినట్టు సమాచారం. సామాజికవర్గాలను సమీక్షించి రాజగోపాల్‌రెడ్డిని సర్దుబాటు చేయాలని, తెలంగాణ నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని రాహుల్‌గాంధీ సూచించినట్టు తెలిసింది. దీంతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ప్రత్యామ్నాయ పోస్టుకు సర్దుబాటు చేసి, ఆయన స్థానంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రివర్గంలో అవకాశం కల్పించటానికి వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నట్టు సమాచారం.

## తెలంగాణ భవన్‌కు కేసీఆర్



ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు, పార్టీ నేతలతో సమావేశాలను కూడా అక్కడి నుంచే నిర్వహిస్తూ వస్తున్నారు కేసీఆర్. ఈ రెండేళ్లలో కేసీఆర్ ప్రజలకు కనిపించింది చాలా అరుదనే చెప్పకోవాలి. అయితే తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం కేసీఆర్ రంగంలోకి దిగనున్నారు. రేపు (ఆదివారం) తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ అధినేత రానున్నారు. కేసీఆర్ అధ్యక్షతన రేపు మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరగనుంది. నదీ జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై కేసీఆర్ సమరశంఖం పూరించనున్నారు. తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం మరో ప్రజా ఉద్యమంపై మాజీ సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశం తర్వాత కేసీఆర్ మీడియాతో మాట్లాడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో 45 టీఎంసీలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందనేది బీఆర్ఎస్ వాదన. నదుల అనుసంధానం పేరుతో ఏపీ జలదోపిడీకి కేంద్రం సహకరిస్తోందని ఆ పార్టీ ఆరోపిస్తోంది.


## భార్యను ముక్కలుగా నరికిన ఘటన..
# సంచలన విషయాలు



హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌లో మాధవి హత్య కేసు సంచలనం సృష్టించింది. మాధవిని హత్య చేసిన ఆమె భర్త, మాజీ సైనికుడు గురుమూర్తి మృతదేహాన్ని ముక్కలు చేసి, వాటిని ఉడికించి, కాల్చి పొడి చేసి చెరువులో కలిపేశాడు. ఎలాంటి ఆధారాలు దొరకకుండా పక్కా ప్లాన్‌తో తన పని పూర్తి చేశాడు. ఈ హత్యా ఉదంతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తాజాగా మాధవి హత్య కేసులో ఒక కీలకమైన మలుపు వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా కోర్టులో జరుగుతున్న ఫాస్ట్ ట్రాక్ విచారణలో భాగంగా ఈ అప్డేట్ వెలువడింది. ఈ కేసులో పోలీసులు మొత్తం 36 మంది సాక్షులను చేర్చగా, అందులో 20 మందికి పైగా సాక్షులను విచారించినట్లు తెలిపారు. మాధవి హత్యకు ప్రధాన కారణం గురుమూర్తి అక్రమ సంబంధం. కొంత కాలంగా తన మరదలు (భార్య సోదరి) తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ క్రమంలోనే మాధవి, గురుమూర్తికి తరుచూ గొడవలు జరిగేవి. తన అక్రమ సంబంధానికి మాధవి అడ్డు వస్తుందని భావించిన గురుమూర్తి ఆమెను చంపాలని ప్లాన్ చేశాడు. జనవరి 16, 2025న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలోనే గురుమూర్తి హత్యకు ఒడిగట్టాడు. డెడ్‌బాడీ ఆనవాళ్లు లేకుండా చేయాలని పథకం వేశాడు.ఈ కేసు తీవ్రతను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసింది. అక్టోబర్ నుంచి రోజువారీ విచారణ జరుగుతుంది. ఈ కేసులో మృతదేహం లభ్యం కాకపోయినా, పోలీసులు సేకరించిన సైంటిఫిక్ ఆధారాలు డీఎన్ఏ తో పాటు క్లూస్ టీమ్ రిపోర్ట్ నిందితుడిని శిక్షించడానికి కీలకంగా మారే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఈ కేసు దర్యాప్తు సమయంలో అనేక రకాల ఊహాగానాలు వినిపించాయి.

## రాజధాని రైలు ఢీకొని 8 ఏనుగులు మృతి

అస్సాంలో జరిగిన రైలు ప్రమాదంలో 8 ఏనుగులు మృతిచెందాయి. సాయిరంగ్-న్యూఢిల్లీ మధ్య నడిచే రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు ఏనుగుల గుంపును ఢీకొట్టింది. అస్సాంలోని హోజాయ్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారుజామున 2.17 నిమిషాలకు ప్రమాదం జరిగినట్లు అధికారులు చెప్పారు. దీంతో ఆ మార్గంలో వెళ్తున్న రైళ్లకు అంతరాయం ఏర్పడింది. ఏనుగులను ఢీకొన్న రైలు పట్టాలు తప్పింది. అయిదు బోగీలు డిరేల్ అయ్యాయి. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కాలేదు. మిజోరం రాష్ట్రంలో ఐజ్వాల్ సమీపంలో ఉన్న సాయిరంగ్ నుంచి ఢిల్లీలోని ఆనంద్ విహార్ టర్మినల్ వరకు రాజధాని రైలు వెళ్తోంది. గౌహతి పట్టణానికి సుమారు 126 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన నేపథ్యంలో యాక్సిడెంట్ రిలీఫ్ రైళ్లు, రైల్వే అధికారులు ఆ ప్రాంతానికి హుటాహుటిన వెళ్లారు. ప్రస్తుతం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. రైలు పట్టాలు తప్పడం వల్ల.. ఏనుగుల శరీర భాగాలు ట్రాక్‌పై చెల్లాచెదురుగా పడినట్లు అధికారులు చెప్పారు. అస్సాం ఎగువ భాగంతో పాటు ఈశాన్యా రాష్ట్రాలకు వెళ్లాల్సిన రైళ్లకు అంతరాయం ఏర్పడింది. డిరేల్ అయిన కోచ్‌ల్లో ఉన్న ప్రయాణికులను ఇతర కంపార్ట్‌మెంట్లకు మార్చారు. అయితే ఎలిఫెంట్ కారిడార్ కాని ప్రాంతంలో ప్రమాదం జరగడం అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నది. రైల్వే ట్రాక్‌పై ఏనుగులు ఉన్నట్లు లోకో పైలెట్ గురించాడు. ఆ వెంటనే అతను ఎమర్జెన్సీ బ్రేక్‌లు వేశాడు. అయినా కానీ రైలును ఏనుగులు ఢీకొన్నాయి. ఆ ఫలితంగా రైలు పట్టాలు తప్పింది.






## రేపటి నుంచి
# పల్స్ పోలియో

పల్స్ పోలియో నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం మరోసారి ఆదేశించింది. ఆదివారం నుంచి మూడు రోజులపాటు జిల్లావ్యాప్తంగా పోలియో చుక్కలు వేసేందుకు వైద్యశాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 6.05 లక్షల కుటుంబాల్లో 2,42,112 మంది అప్పుడే పుట్టిన బిడ్డల నుంచి ఐదేళ్ల లోపు వారు ఉన్నట్లు గుర్తించారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం జిల్లాకు మూడు లక్షల వ్యాక్సిన్ డోసులను పంపింది. ఆ వ్యాక్సిన్స్‌ను ఒంగోలు నుంచి అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, ప్రభుత్వ వైద్యశా లలకు ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఈనెల 21న జిల్లావ్యాప్తంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 1,945 కేంద్రాలను సిద్ధం చేశారు. పీపీ యూనిట్లు, అర్బన్, రూరల్, గిరిజన ప్రాంతాలతోపాటు వాహనాల్లో బూత్‌లు, మొబైల్ టీంలను ఏర్పాటు చేశారు. పిల్లలకు పోలియో చుక్కలను వేసేందుకు జిల్లా వ్యాప్తంగా 7,528 మంది ఉద్యోగుల సేవలను వినియోగించుకోనున్నారు. అందుకోసం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.



## సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పసలేని, తెలివి తక్కువ వాళ్ళు బీఆర్ఎస్‌తో బీజేపీకి పొత్తు ఉందని మాట్లాడుతారని మండిపడ్డారు. ఎవరితో బీజేపీ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ.. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై అడిగితే తప్పేంటి ప్రశ్నించారు. గతంలో సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై కూడా అడిగారని గుర్తుచేశారు. పసలేని వాళ్ల తమ మీద ఆరోపణలు చేస్తే జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయ విమర్శలు మాని ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని హితవుపలికారు. ఆదాయం వ్యక్తిగత అవసరాల కోసం జీహెచ్ఎంసీలో మునిసిపాలిటీలు , కార్పొరేషన్ల విలీనం చేశారని.. దీనిపై మొదటి నుంచి బీజేపీ అభ్యంతరం చెబుతోందన్నారు. గ్రామాల్లో గెలిచిన సర్పంచ్‌లను డబ్బు ఆశ , ఇతర అంశాలను సాకుగా చూపి కాంగ్రెస్‌లోకి రావాలని కోరుతున్నారని మండిపడ్డారు.



## డిసెంబర్ 25న ఓటిటిలోకి
# ఆంధ్ర కింగ్ తాలూకా

మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో రామ్ పోతినేని హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా దర్శకుడు మహేష్ బాబు పి తెరకెక్కించిన లేటెస్ట్ చిత్రమే 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మంచి బజ్ నడుమ రిలీజ్ కి వచ్చిన ఈ సినిమా రామ్ కెరీర్ లో ఒక డీసెంట్ పెర్ఫార్మర్ గా నిలిచింది. ఇక ఈ సినిమాలో రియల్ స్టార్ ఉపేంద్ర కూడా నటించగా థియేటర్స్ నుంచి ఇప్పుడు ఫైనల్ గా ఈ సినిమా ఓటిటిలోకి వచ్చేందుకు సిద్ధం అయ్యింది.ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు దిగ్గజ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక అందులో ఈ సినిమా ఈ డిసెంబర్ 25 క్రిస్మస్ కానుకగా స్ట్రీమింగ్ కి తెస్తున్నట్టుగా నెట్ ఫ్లిక్స్ వారు ఇప్పుడు అనౌన్స్ చేసేసారు. ఇక ఈ సినిమాని మొత్తం పాన్ ఇండియా భాషల్లో తెస్తున్నట్టు కూడా కన్ఫర్మ్ చేశారు. మరి ఓటిటిలోకి వచ్చాక ఈ సినిమా ఎలాంటి రెస్పాన్స్ ని అందుకుంటుందో చూడాలి.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



# కృతి సనన్ హాట్ లుక్స్

ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలోని అగ్ర హీరోయిన్లలో ఆమె ఒకరు. తక్కువ సమయంలోనే హిట్ చిత్రాల్లో నటించిన ఈ అమ్మడు.. ఇటీవలే లగ్జగీ పెంట్ హౌస్ కొనుగోలు చేసినట్లు సమాచారం. ఆమె మరెవరో కాదండి.. హీరోయిన్ కృతి సనన్. మిమి సినిమాకుగానూ ఉత్తమ నటిగా జాతీయ చలనచిత్ర అవార్డ్ అందుకుంది. ఈ ఒక్క సినిమా ఆమె కెరీర్ ను మలుపు తిప్పింది. దీంతో హిందీ సినిమా ప్రపంచంలోని స్టార్ హీరోయిన్లలో ఆమె ఒకరిగా నిలిచింది. తాజాగా ఈ అమ్మడు ముంబైలోని నాగరిక పాలి హిల్ ప్రాంతంలో సముద్రానికి ఎదురుగా ఉన్న డ్యూప్లెక్స్ పెంట్‌హౌస్‌ను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. నివేదికల ప్రకారం కృతి సనన్ కొనుగోలు చేసిన రెసిడెన్షియల్ టవర్‌లోని ఈ లగ్జరీ పెంట్‌హౌస్‌ను రూ. 78.20 కోట్లు అని తెలుస్తోంది. ది ఎకనామిక్ టైమ్స్ ప్రకారం కృతి కొత్త ఇల్లు 14వ , 15వ అంతస్తులలో విస్తరించి ఉంది. ఇది 6,636 చదరపు అడుగుల వైశాల్యం కలిగి ఉంది. పై అంతస్తుతో పాటు 1,209 చదరపు అడుగుల టెర్రస్ కూడా ఉంటుంది. చదరపు అడుగు ధర దాదాపు రూ. 1.18 లక్షలు. ఈ ఒప్పందంలో 6 కార్ పార్కింగ్ స్లాట్లు కూడా ఉన్నాయి. ఈ డీల్ కోసం కృతి సనన్ రూ.3.91 కోట్ల స్టాంప్ డ్యూటీ, GST, ఇతర ఛార్జీలతో సహా మొత్తం రూ.84.16 కోట్లకు పైగా చెల్లించింది.

# జనాభా పెరుగుతున్నా కండోమ్‌లపై పన్ను తగ్గించేందుకు ఐఎంఎఫ్ నో



ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి మరోసారి షాకిచ్చింది. దేశంలో విపరీతంగా పెరుగుతున్న జనాభాను అరికట్టేందుకు గర్భనిరోధక సాధనాలపై పన్ను మినహాయింపు ఇవ్వాలన్న పాక్ ప్రభుత్వ అభ్యర్థనను ఐఎంఎఫ్ నిర్మొహమాటంగా తిరస్కరించింది. పన్ను వసూళ్లలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో.. కండోమ్‌లపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీని తొలగించేందుకు ద్రవ్య నిధి మొండికేసింది. ప్రస్తుతం పాకిస్థాన్ ఐఎంఎఫ్ నుంచి పొందుతున్న బెయిలవుట్ ప్యాకేజీలో భాగంగా కఠినమైన నిబంధనలను అమలు చేస్తోంది. ఈ క్రమంలో గర్భనిరోధక సాధనాలపై పన్ను తగ్గిస్తే రాబడి లక్ష్యాలు దెబ్బతింటాయని ఐఎంఎఫ్ అభిప్రాయపడింది. ఒకవేళ రాయితీలు ఇవ్వాలనుకుంటే వచ్చే బడ్జెట్ వరకు వేచి చూడాలని స్పష్టం చేసింది. ఇలాంటి మినహాయింపులు ఇస్తే పన్నుల అమలు యంత్రాంగం బలహీన పడుతుందని, పైగా ఈ వస్తువుల అక్రమ రవాణా పెరిగే ప్రమాదం ఉందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. కేవలం కండోమ్‌లే కాకుండా మహిళలకు అవసరమైన శానిటరీ ప్యాడ్‌లు, శిశువుల డైపర్లపై కూడా పన్ను రాయితీలు ఇవ్వడానికి ఐఎంఎఫ్ అంగీకరించలేదు. పాక్ ఫెడరల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూ పంపిన ఈ ప్రతిపాదనల వల్ల దాదాపు 400 నుంచి 600 మిలియన్ పాకిస్థాన్ రూపాయల ఆదాయం తగ్గుతుందని అంచనా వేసి.. ఆ ప్రతిపాదనలను తిరస్కరించింది. ప్రపంచంలో అత్యంత వేగంగా జనాభా పెరుగుతున్న దేశాల్లో పాకిస్థాన్ ఒకటి. ప్రస్తుతం అక్కడ ఏటా దాదాపు 60 లక్షల మంది జనాభా అదనంగా చేరుతున్నారు. జనాభా వృద్ధి రేటు 2.55 శాతంగా ఉంది. ఈ పెరుగుదల వల్ల ప్రభుత్వ సేవలు, సామాన్యుల ఆదాయాలపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఇలాంటి సమయంలో గర్భనిరోధక సాధనాలను చౌకగా అందించాలని ప్రభుత్వం భావించింది. అయితే ఐఎంఎఫ్ నిబంధనల వల్ల విధించిన 18 శాతం జీఎస్టీ కారణంగా.. ఇవి సామాన్యులకు అందనంత భారంగా మారాయి. విదేశీ అప్పుల కోసం నిత్యావసరాలను కూడా పాక్ ప్రభుత్వం 'లగ్జరీ' వస్తువులుగా పరిగణించాల్సి రావడం అక్కడి దయనీయ స్థితికి అద్దం పడుతోంది. అయితే ఐఎంఎఫ్ షరతులను నెరవేర్చడానికి పాకిస్థాన్ తీవ్రంగా శ్రమిస్తోంది. పన్ను వసూళ్లతో పాటు ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను కూడా వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ విక్రయానికి రంగం సిద్ధం చేసింది. ఇప్పటి వరకు ఐఎంఎఫ్ నుంచి దాదాపు 3.3 బిలియన్ డాలర్ల నిధులను పాక్ పొందింది. ఈ అప్పుల నుంచి బయటపడలేక.. చివరకు దేశ జనాభా నియంత్రణ అంశాన్ని కూడా ఆర్థిక లెక్కలకే పాక్ ప్రభుత్వం వదిలేయాల్సి వస్తోంది.



## ప్రాణం మీదికి తెచ్చిన ప్రేమ భవనం పైనుంచి పడి యువతి మృతి

ప్రేమ వ్యవహారం ఓ యువతి ప్రాణాల మీదికి తెచ్చింది. ప్రేమికులు ఇద్దరు ఇంట్లో ఉన్న సమయంలో హఠాత్తుగా యువతి తండ్రి రావడంతో తప్పించుకునే క్రమంలో బాల్కానీ లోంచి జారిపడి ప్రాణాలు కోల్పోయిన ఘటన సంగారెడ్డి జిల్లా కొల్లూర్‌లోని కేసీఆర్‌నగర్ 2బీహెచ్‌కే సముదాయంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చార్మినార్‌కి చెందిన హాలమ్దార్ ఉస్సేన్ కూతురు ఫాతిమా, చార్మినార్‌కే చెందిన మీర్‌ఉస్సేన్ అలీఖాన్ ఇద్దరు ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరు కొంతకాలం కోఠిలోని ఓ కాల్ సెంటర్‌లో పని చేశారు. ఫాతిమా కోటి ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నది. ఫాతిమా, మీర్‌ఉస్సేన్ అలీఖాన్ ఇద్దరు కాల్ సెంటర్‌లో పని చేసే సమయంలో పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఫాతిమా తండ్రికి కొల్లూర్ 2బీహెచ్‌కే సముదాయంలోని 40వ బ్లాక్‌లో 813 ఫ్లాట్ వచ్చింది. ఆ కుటుంబం ఇంకా ఇక్కడికి షిఫ్ట్ కాకపోవడంతో ఖాళీగా ఉంది. అప్పుడప్పుడు ఆయన వచ్చి తమ ఫ్లాట్‌ని చూసుకొని వెళ్లేవాడు. గురువారం మధ్యాహ్నం ఫాతిమా ప్రియుడి తో కలిసి డబుల్ బెడ్‌రూం ఇంటికి వచ్చింది. అదే సమయంలో తన తండ్రి ఉస్సేన్ ఫ్లాట్ వద్దకు రావడంతో బయట నుంచి తాళం తీసి ఉండడాన్ని గ్రహించి డోర్ కొట్టాడు. దీంతో ఆమె ఒక్కసారిగా తన తండ్రి గొంతు విని భయంతో టెన్షన్‌కు గురైంది. ఆ సమయంలో ఏం చేయాలో తోచక ప్రియుడు మీన్‌ఉస్సేన్ అలీఖాన్ సహకారంతో బాల్కానీ నుంచి కింది బాల్కానీలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో పట్టుతప్పి ఎనిమిదో అంతస్తు నుంచి కిందపడి తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలి సోదరుడు సయ్యద్ అలీ అబ్బాస్ ఫిర్యాదు మేరకు కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## ఢిల్లీలో తగ్గిన వాయు నాణ్యత

దేశ రాజధాని ఢిల్లీని ఇవాళ కూడా పొగమంచు కమ్మేసింది. శనివారం తెల్లవారుజామున ఢిల్లీ వీధులన్నీ పొగమంచుతో నిండిపోయాయి. దీంతో అక్కడ విజిబులిటీ తగ్గిపోయింది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటలకు ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 384గా ఉన్నది. దీంతో అక్కడ విజిబులిటీ పూర్ క్యాటగిరీలోకి వెళ్లింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం కొన్ని ప్రాంతాల్లో కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉన్నట్లు తెలిసింది. నగరంలోని అనేక ప్రాంతాల్లో కాలుష్యం స్థాయి ఆందోళనకరంగా ఉన్నది. సీపీసీబీ ప్రకారం సరాయి కాలే ఖాన్ వద్ద ఏక్యూఐ 428గా ఉంది. అక్షర్‌దామ్ వద్ద 420 ఏక్యూఐ రికార్డు అయ్యింది. తులారామ్ మార్గ్ వద్ద 403గా రిజిస్టర్ అయ్యింది. ఆనంద్ విహార్ వద్ద 428, అశోక్ విహార్ వద్ద 407, ఐటీవో వద్ద 429 లెవల్స్ నమోదు అయ్యాయి. వాయు నాణ్యత తగ్గిపోవడంతో ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్ కమీషన్ కఠిన చర్యలు తీసుకున్నది గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఢిల్లీతో పాటు ఎన్సీఆర్ ప్రాంతంలో స్టేజ్-4 ప్రణాళిక అమలు చేస్తున్నది. గ్రాప్-4 ప్రకారం నిర్మాణ పనులను ఆపేస్తారు. డీజిల్ వాహనాలపై ఆంక్షలు ఉంటాయి. శనివారం తీవ్రమైన పొగమంచు ఉన్న కారణంగా.. ఇందిరా గాంధీ విమానాశ్రయ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశారు. విజిబులిటీ తక్కువగానే ఉన్నా.. అన్ని విమానాలు నార్మల్‌గా నడుస్తున్నట్లు అధికారులు చెప్పారు. అయితే విమానాల తాజా అప్‌డేట్ కోసం సంబంధిత ఎయిర్‌లైన్ సంస్థలను కాంటాక్టు కావాలని ప్రయాణికులకు సూచన చేసింది.

## శంషాబాద్ ను ప్రత్యేక జోన్‌గా ప్రకటించాలని డిమాండ్

శంషాబాద్ ను ప్రత్యేక జోన్ గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నాయకులు శంషాబాద్ మున్సిపాలిటీలో ప్రజల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాపారులు, విద్యాసంస్థలు, విద్యార్థి సంఘాలు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి కూడా తన మద్దతును ప్రకటించి సంతకం చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీని ఏడు గ్రామాలను కలుపుతూ జిహెచ్ఎంసిలో విలీనం చేయడం సంతోషమే అయినా, శంషాబాద్ ను చార్మినార్ జోన్ లో కలపడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.





## ఇందిరమ్మ రాజ్యంలో గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయమన్న మల్లు భట్టి విక్రమార్క

రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బేగంపేటలోని ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ప్రజావాణి రెండో వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజావాణి ఇన్‌ఛార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులు తమ అనుభవాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లలో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని వెల్లడించారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆక్షేపించారు.

## 'పుష్ప 2' రికార్డును బ్రేక్ చేసిన 'ధురంధర్'

బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజా నివేదికల ప్రకారం, నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా కోసం రూ. 285 కోట్లు చెల్లించినట్లు సమాచారం. ఇది 'పుష్ప 2' ఓటీటీ డీల్ కంటే ఎక్కువ అని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. డిసెంబర్ 5న విడుదలైన ఈ చిత్రం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది.



## కొడుకు మృతి తట్టుకోలేక తండ్రి మృతి



యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం నెమిల గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకున్నది. మోత్కుపల్లి బాలకిషన్ (33) పచ్చకామెర్లతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య ఇటీవల వార్డు మెంబర్‌గా గెలవడంతో ఆ ఎన్నికల బిజీలో అనారోగ్య సమస్యను తీవ్రంగా పట్టించుకోకపోవడంతో మృత్యువు ఒడిలోకి చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అయితే అతని అంత్యక్రియలు కాకముందే మృతుని తండ్రి మోత్కుపల్లి ఐలయ్య (60) గుండెపోటుతో రాత్రి మృతి చెందాడు.కాగా, గ్రామానికి చెందిన పోతర్ల లక్ష్మి నరసయ్య (60) తన వ్యవసాయ బావి వద్దకు శుక్రవారం సాయంత్రం వెళ్లి తిరిగి రాకపోవడంతో పక్క బావి వాళ్ళు వెళ్లి చూడగా అక్కడే మృతి చెంది ఉన్నాడు. గ్రామంలో ముగ్గురు అంత్యక్రియలు ఒకే రోజు (శనివారం) జరగనున్నాయి. మా గ్రామానికి ఏమైనది ? ప్రజలు చర్చించుకుంటున్నారు.